క్లుప్తంగా

భూసార పరీక్షలతో మేలు


రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: భూసార పరీక్షలు చేయడంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఏఓ వరలక్ష్మి అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో శనివారం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు తన పొలంలో భూసార పరీక్షలు చేసుకోవడంతో పాటు సాయిల్ హెల్త్ కార్డులు తీసుకోవాలని సూచించారు. భూసార పరీక్షలు చేసిన ఫలితాలను వీఏఏలు రైతులకు వివరించాలన్నారు. సేంద్రియ ఎరువులు వీలైనంత ఎక్కువగా ఉపయోగించాలన్నారు. నేలను కాపాడితేనే రేపటి తరాలకు భవిష్యత్తు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గుట్టపై గోవింద నామస్మరణ


గోవింద నామస్మరణతో కొలుస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం టి.వేపనపల్లి సమీపంలోని గోవిందరాజుల గుట్ట శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ నిర్వాహకులు ఉదయం శ్రీవారి పాదాలకు ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం చుట్టూ పక్కల గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కొత్తూరు బాబు, అమరనాథ్‌రెడ్డి, స్వామినాథరెడ్డి, బాబునాయుడు, నీరజాక్షులు నాయుడు, ముఖేష్‌నాయుడు, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

కాణిపాకంలో భద్రాచలం ఈఓ


స్వామివారి చిత్రపటం అందుకుంటున్న ఈఓ

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారిని శనివారం భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు అందజేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్ర పటం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్ర కీలాద్రిపై భక్తి రంజని


ప్రశంసాపత్రం అందుకుంటున్న రాజశేఖర్

ఐరాల: విజయవాడ కనకదుర్గమ్మ ఆస్థాన మండపంలో శనివారం దేవస్థానం వారు ఏర్పాటు చేసిన భక్తి రంజని కార్యక్రమంలో మన సంస్కృతి కళా సంస్థ వారి ఆధ్వర్యంలో గాయకులు భక్తి పాటలు, బృంద గానాలతో భక్తులను అలరించారు. ఈ భక్తి పాటల కార్యక్రమంలో మండలానికి చెందిన ప్రముఖ గాయకుడు, శ్రీదేవి కళావేదిక వ్యవస్థాపకుడు రాజశేఖర్ పాల్గొని భక్తి పాటలు ఆలపించి అలరింపచేశారు. ఆయనకు ఆలయ ధర్మకర్తల మండలి, ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి రతన్ రాజు చేతులమీదుగా ప్రశంసాపత్రం, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు.

సత్యసాయి జయంతి వారోత్సవాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సత్యసాయి జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని శ్రీ సత్యసాయి సేవా సమితిలో శనివారం సమితి సభ్యులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం అభిషేక పూజలు చేసి ప్రశాంతి పతకం ఆవిష్కరించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేయించారు. మెడికల్ క్యాంపు నిర్వహించి 108 మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం భజన హారతి, పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మధుసూదనం పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘ నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10గంటల వరకు కంటిపరీక్షలు చేస్తారన్నారు. ఇందులో ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

పూతలపట్టు: ట్రాక్టర్ ట్రాలీకున్న గొలుసు తెగిపోవడంతో బోల్తా పడిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ట్రాక్టర్ వెళ్తుండగా కాణిపాకం క్రాస్ వద్ద ట్రాక్టర్ ట్రాలీకున్న చైన్ తెగిపోయింది. దీంతో ట్రాలీ బోల్తా పడింది. ట్రాక్టర్‌లోని ఇద్దరు మహిళలకు స్వల్పగాయాలు కావడంతో వారిని మండల కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

వేరుశనగ సాగుకు దుక్కి దున్నుతున్న రైతు



ఐరాలలో ప్రస్తుతం బీడుగా ఉన్న పొలం



అన్నదాతకు అందని భరోసా

- పుంజుకోని రబీ సాగు
- ఆర్‌బీకేలో అరకొరగా ఎరువులు
- ఉచిత పంటల బీమాను రద్దు చేసిన సర్కారు
- నామమాత్రంగా నమోదైన సాగు విస్తీర్ణం
- పంటల సాగుపై ఆసక్తి చూపని రైతులు

ఐరాల: మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఏటా రబీ సీజన్‌లో వివిధ పంటల సాగుకు రైతులు ఎంతో ఆసక్తి చూపేవారు. ఇందుకు కారణం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అండగా నిలిచి అనేక రకాలుగా ప్రోత్సహించారు. గత ఐదేళ్ల అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయం దండగ కాదు పండగ అని చేసి చూపించారు. మండలంలో 18 ఆర్బీకేలను నిర్మించి అన్ని రకాలు సేవలను రైతుల ముంగిటకే అందించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్బీకే సేవలను నిర్వీర్యం చేసింది. రైతులకు చేయూత కరువైంది. దీంతో రైతులు రబీ సీజన్లో పంటల సాగుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఫలితంగా ఈ ఏడాది రబీలో సాధారణ సాగు విస్తీర్ణానికి నోచుకోలేదు.

184 హెక్టార్లలో మాత్రమే పంటల సాగు

ఏటా రబీలో రైతులు వివిధ పంటలను సాగు చేస్తారు. ప్రధానంగా వరి పంటను ఎక్కువగా సాగు చేస్తారు. దీంతో పాటు వేరుశనగ, రాగి, ఉలవలు, మినుములు, మొక్కజొన్న తదితర పంటలను కూడా సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతారు. ఈ ఏడాది మండలంలో 765 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారుల అంచనా. అయితే ఇంత వరకు రైతులు నామమాత్రంగా పంటలను సాగు చేశారు. మండలంలో 184 హెక్టార్లలో మాత్రమే రబీలో వివిధ పంటలను సాగు చేయడం గమనార్హం.

కూటమి సర్కారు ప్రభావం

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ఉచిత పంటల బీమాను రద్దు చేసింది. ఈ ఏడాది రబీ సీజన్ నుంచే ఉచిత పంటల బీమాను రద్దు చేసింది. కూటమి ప్రభుత్వ ప్రభావం రబీ సీజన్‌లో సాగు చేసే పంటలపై పడింది. ఖరీఫ్ సీజనలో సాగుకు చేసిన పెట్టుబడులు రాక అప్పుల బాధలో కూరుకుపోయి అల్లాడిపోతున్న అన్నదాతలకు చంద్రబాబు సర్కార్ మరో భారం మోపింది. దీంతో రైతులు సొంత డబ్బుతో బీమా ప్రీమియం చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారు. పంటలను సాగు చేయడానికి రైతుల్లో ఆసక్తి తగ్గింది. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ప్రభుత్వమే ఖరీఫ్, రబీలో సాగు చేసే పంటలకు బీమా ప్రీమియం చెల్లించి అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలిచింది. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే రైతులను నట్టేట ముంచారు. ఉచిత పంటల బీమాను రద్దు చేసి రైతులను కోలుకోని దెబ్బతీయడంతో రబీ సీజన్‌లో పంటల సాగు ఆశించిన స్థాయిలో ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రైతన్నలకు అందని పెట్టుబడి సాయం

రబీ సీజనలో పంటల సాగుకు రైతులకు పెట్టుబడి సాయం కూడా ఎంతో అవసరం. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రబీలో రైతులకు పెట్టుబడి సమస్య కూడా ఎదురైంది. గత ప్రభుత్వ హయాంలో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రతి ఏడాది రూ.13,500 క్రమం తప్పకుండా రైతుల వ్యక్తిగత ఖాతాలో జమ చేసేవారు. అంతే కాకుండా సరసమైన ధరలకు ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందేవి. అయితే ప్రస్తుతం ఆర్‌బీకేల్లో అందాల్సిన సేవలు నిలిచిపోయాయి. అరకొర ఎరువులు అందుబాటులో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి 6 నెలలు అవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు.

పంటల బీమా రద్దు అన్యాయం



ఉచిత పంటల బీమా రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే రైతులను దెబ్బ తీసింది. దీంతో రబీలో పంటల సాగుపై ఆసక్తి తగ్గిపోయింది. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. చాలామంది అప్పులు చేసి రబీలో పంటలు సాగు చేసే పరిస్థితి నెలకొంది.

– జయరాం, రైతు, ఐరాల

అప్పు చేసి పంటలు సాగు చేయలేం



అప్పులు చేసి రబీలో పంటలు సాగు చేయలేం. దీంతో ఈ ఏడాది పంటలను సాగు చేయడానికి వెనుకంజ వేస్తున్నాం. పెట్టుబడి సాయం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఆనందంగా పంటలను సాగు చేసే వాళ్లం.

– హరిరెడ్డి, మట్టపల్లె, ఐరాల

చర్యలు తీసుకుంటున్నాం



రబీలో పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం కూడా రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. రబీ సీజన్ ప్రారంభంలో ఇంత వరకు రైతులు 184 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారు. సబ్సిడీతో రైతులకు ఉలవలను పంపిణీ చేశాం. సాధారణ విస్తీర్ణంలో పంటలు సాగయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– వరలక్ష్మి, ఏఓ, ఐరాల

పారిశ్రామికవేత్త అదానీని అరెస్టు చేయాలి



రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: అంతర్జాతీయ పారిశ్రామికవేత్త అదానీని అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయం వద్ద శనివారం రోడ్డుపై నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ, సెకీ నుంచి రాష్ట్ర డిస్కంలు విద్యుత్ ఒప్పందాలు చేసుకునేందుకు అదానీ గ్రూపు భారీ ముడుపులు చెల్లించిన నేపథ్యంలో అదానీ గ్రూపు కంపెనీ చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలన్నారు. సెకి ఒప్పందమే గాక రాష్ట్రంలో చేసుకున్న ఒప్పందాల రద్దు పై కూటమి ప్రభుత్వం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వారికి కేటాయించిన భూముల్ని వెనక్కి తీసుకోవాలన్నారు. విశాఖ డేటా సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సురేంద్రన్, గిరిధర్‌గుప్తా, నాయకులు మురళి, ఈశ్వరయ్య, దాసు, ఆనంద్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు

పోలీసుల అదుపులో అప్రైజర్

యాదమరి (పూతలపట్టు): యాదమరిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఈ నెల 14వ తేదీ మొదలైన ఆడిటింగ్ శనివారం ముగిసింది. ఈ ఆడిటింగ్‌లో అప్రైజర్ భాస్కరాచారి లీలలు వెలుగులోకి వచ్చాయి. ఖాతాదారులు తనఖా పెట్టిన నగలను చిత్తూరులోని మరో బ్యాంక్‌లో తనఖా పెట్టి డబ్బును తెచ్చి రుణాన్ని ముగించారు. ఆడిటింగ్ ముగిసిన అనంతరం వారి ఖాతాలోకి నగదు జమ అవుతుందని మాయ మాటలు చెప్పి ఖాతాదారులను మోసం చేసినట్లు బ్యాంకర్లు తెలిపారు. బ్యాంక్ అధికారుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు భద్రత కరువు


చోరీ జరిగిన నరహరిపేట ఉన్నత పాఠశాల

గుడిపాల: సరస్వతీ నిలయాలకు రక్షణ కరువవుతోంది. పాఠశాలలకు సెలవులొస్తే ఇక సవాలే. బడులకు సరైన ప్రహరీలు లేకపోవడంతో పాఠశాలలలోని విలువైన వస్తువులు, రికార్డులు చోరీలకు గురవుతున్నాయి. పాఠశాల ప్రాంగణాలు అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారుతున్నాయి. పశువులు కూడా బడి ఆవరణలో సంచరిస్తున్నాయి. ప్రధానంగా విద్యాలయాలకు పూర్తి స్థాయిలో రక్షణ గోడలు లేకపోవడం, గ్రామానికి దూరంగా పాఠశాల భవనాలు ఉండడంతో దొంగతనాలకు అనువుగా మారాయి. దీంతో ఏటా పాఠశాలలో చోరీలు జరుగుతూనే ఉన్నాయి. చోరీలను నివారించేందుకు అధికార యంత్రాంగం శాశ్వత చర్యలు చేపట్టలేదు. మండలంలో 62 పాఠశాలల్లో 2,500 మందికి పైగా చదువుకుంటున్నారు. ఒక్కో ఉన్నత పాఠశాలలో 15 కంప్యూటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధిస్తున్నారు. వీటికి ప్రస్తుతం రక్షణ లేకుండా పోతోంది. కొద్దిరోజుల క్రితం నరహరిపేట ఉన్నత పాఠశాలలో భారీ చోరీ జరిగింది. లక్షలాది రూపాయలు విలువచేసే కంప్యూటర్లు, బియ్యం, సరుకులు చోరీ అయ్యాయి. అయితే ఈ విషయం బయటికి పొక్కితే పరువు పోతుందనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు అణచివేశారు. అయినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మండలంలో 30 పాఠశాలల వరకు ప్రహరీగోడలు లేకపోవడం గమనార్హం. అధికార యంత్రాంగం ఇకనైనా స్పందించి చోరీలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యాంటీబయోటిక్స్ వాడకం తగ్గించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పశువులకు యాంటిబయోటిక్స్ వాడకాన్ని తగ్గించుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ అన్నారు. చిత్తూరు నగరం దర్గా సర్కిల్‌లోని పశువైద్యశాలలో యాంటీమైక్రోబియల్ నిరోధకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు సోకే పలు వ్యాధులను నివారించడంలో యాంటిబయోటిక్ మందులను వినియోగిస్తున్నారన్నారు. ఈ వినియోగం ప్రజల ప్రాణానికి ముప్పు తెచ్చిపెడుతోందన్నారు. ప్రతి వ్యక్తి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని యాంటిబయోటిక్ మందుల వినియోగాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యువజన సంఘం నాయకులు

బంగారుపాళెం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ, మాలమాదిగలు అన్నదమ్ములుగా కలసి మెలసి ఉంటున్నామన్నారు. రాజకీయ పార్టీలు ఎస్సీలను విభజించి రాజకీయ ప్రయోజనాలు అందుకునేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీవర్గీకరణను ప్రభుత్వం నిలుపుదల చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవయ్య, గోవిందు పాల్గొన్నారు.

2,500 లీటర్ల సారా ఊట ధ్వంసం


సారా ఊటను ధ్వంసం చేసిన ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు

గుడిపాల: మండలంలో 2,500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరెడ్డి తెలిపారు. రాసనపల్లె అటవీ ప్రాంతంలోని పిల్లిగుట్ట, సర్దార్‌మిట్ట, ఊటవంక ప్రాంతాల్లో శనివారం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వారి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. అనంతరం రాసనపల్లెలో గ్రామపెద్దలు పీటర్, ప్రకాష్ సమక్షంలో గ్రామస్తులకు నాటుసారా తయారీ, అమ్మకాలు, తాగడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదుస్సు నిర్వహించారు. గ్రామస్తులు తమకు జీవనోపాధి కల్పించినట్లయితే సారా తయారీని విరమించుకొంటామని అభ్యర్థించారు. జిల్లా స్థాయి అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. సారా తయారీని విరమించుకోకపోతే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని అధికారులు వారికి తెలియజేశారు.

బాలికలతో గౌరవప్రదంగా మెలగాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: పాఠశాలల్లో బాలికల పట్ల గౌరవంగా మెలగాలని బంగారుపాళెం సీఐ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఆధునిక సమాజంలో చిన్నపిల్లలు, బాలికలు, మహిళలపై అఘాయిత్యాలపై జరుగుతున్న తీరును తెలియజేశారు. బాలికలను, మహిళలను గౌరవించి వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. కో-ఎడ్యుకేషన్‌లో బాల బాలికలు కలసి చదువుకోవడం వల్ల స్నేహ పూర్వక వాతావరణం ఉండాలని చెప్పారు. ఆడపిల్లలతో తప్పుగా ప్రవర్తించడం నేరమన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చే క్రమంలో రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు క్రాస్ చేసేటప్పుడు వాహనాల రాకపోకలను గమనించి రోడ్డు దాటాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వళ్లెమ్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్ గేటు వసూలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మార్కెట్ గేటు రుసుములను ఆదివారం నుంచి వసూలు చేయనున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన మార్కెట్ టెండరును రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్, జంతు వధశాలలు, ఎన్టీఆర్, పాత బస్టాండ్లు, ప్రైవేటు బస్సుల పార్కింగ్‌పై గేటు వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కార్పొరేషన్ అధికారులు, సచివాలయ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

సాఫ్ట్‌బాల్ రంగ స్థలం


విజేతలకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్న ట్రోఫీలు

తవణంపల్లె మండలం అరగొండ బాలుర హైస్కూల్లో 68వ రాష్ట్ర స్థాయి అండర్‌-14 బాల బాలికలు సాఫ్ట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు తొలిసారిగా మండలంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన బాలబాలికలు హోరాహోరీగా తలపడుతున్నారు. విజయమే లక్ష్యంగా పోరాట పటిమను ప్రదరిస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ టోర్నీలో రెండోరోజు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. శనివారం క్రీడామైదానంలో చోటుచేసుకున్న సంఘటనల చిత్రమాలిక.

–తవణంపల్లె


మైదానంలో పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులు


శ్రీకాకుళం క్రీడాకారిణికి గాయం కావడంతో చికిత్స చేస్తున్న 108 సిబ్బంది


క్రీడామైదానంలో టీ తాగి సేదతీరుతున్న క్రీడాకారులు


స్కోర్ నమోదులో తేడా ఉందని గొడవ పడుతున్న గుంటూరు, శ్రీకాకుళం పీడీలు